# భవబంధాలు

సైకిలు తుడవడం పూర్తి చేసి, కాస్త దూరంలో నిలబడి దానికేసి పరీక్షగా చూశాడు శివయ్య. నవమాసాలు మోసి, కష్టపడి కని, విధిలేని పరిస్థితిలో బిడ్డను పరాయి వాళ్ళకు అప్పగిస్తున్న తల్లి శిశువు వంక చూసే కడసారి చూపులో కదిలే ఆర్ద్రత శివయ్య కళ్ళలో కదిలింది. పై కండువాతో మొహం తుడుచుకుని, సైకిలు కడగగా మిగిలిన నీటిని కాళ్ళమీద ఒంపుకుని, ఖాళీ బకెట్ చేత బుచ్చుకుని గుమ్మం వైపు నడిచాడు శివయ్య.

అదే క్షణంలో దగ్గిరగా వేసి ఉన్న తలుపు తెరుచుకుని బయటకు వస్తున్న కృష్ణమూర్తి చూపులు లిప్త కాలంలో తండ్రిని, ఆయన చేతిలోని బకెట్టును, నీరెండలో నిలుచున్న సైకిలును పర్యవేక్షించాయి.

తండ్రి తనకేసి ప్రశ్నార్థకంగా చూడడం గమనించి – "అమ్మ ఒకటే మూలుగుతుంది. తల తిరుగుతూందట" అని తండ్రి వైపు అదోలా చూసి చెప్పి వెళ్ళిపోయాడు కృష్ణమూర్తి.

ఆ చూపుల అర్థం శివయ్యకు బాగా తెలుసు. 'ఇంట్లో పెళ్ళాం చావు బ్రతుకుల్లో ఉంటే ప్రాణంలేని ఇనుప వస్తువుమీద చూపించే పాటి శ్రద్ధ ఆవిడ పట్ల చూపించలేని నువ్వేం మనిషివి?' అన్న తిరస్కారం కొడుకు కళ్ళలో చదువుకున్న శివయ్య పెదిమలమీద చిత్రమైన చిరునవ్వు తొంగి చూసింది.

బి.ఎస్.సి. కాగానే యూనివర్సిటీలో చేరి ఎమ్. ఎస్.సి. చదవాలని ఉబలాట పడ్డాడు కృష్ణమూర్తి, అంత ఖర్చుపెట్టి చదివించే స్తోమతు తనకు లేదని, ఇంకా చదువుకోవలసిన మరొక కొడుకు, పెళ్ళి కావలసిన ఆడపిల్ల బాధ్యత తన మీద ఉన్నది కనక కృష్ణమూర్తి ఏదైనా ఉద్యోగం చూసుకుంటే మంచిదని నిష్కర్షగా చెప్పాడు శివయ్య.

రోషం తెచ్చుకుని, తన స్నేహితుని సహాయంతో, నెల తిరక్కుండానే ఒక కంపెనీలో మెడికల్ రి(ప్రెజెంటేటివ్‌గా చేరాడు కృష్ణమూర్తి, సంపాదనా పరుడయి పిల్లా పాపలతో జీవితంలో స్థిరపడ్డాక కూడా తండ్రి తనకేదో అన్యాయం చేశాడన్న భావం కృష్ణమూర్తిలో మిగిలిపోయింది.

శివయ్య లోపలికి వచ్చి, గదిలో మంచం మీద పడుకొని మూలుగుతున్న భార్య తలవైపుగా నిలబడి – "ఎలాగుంది, వర్ధనీ నీకు? కొంచెం సర్దుకుంటే మనం రేపే ప్రయాణం కావచ్చు" అన్నాడు నెమ్మదిగా.

ఒక్కసారి కొద్దిగా – కళ్ళు తెరిచి భర్తను చూసి, మళ్ళీ కళ్ళు మూసుకుంది వర్ధనమ్మ, 'తనింత జబ్బుతో మూలనపడి ఉంది. రేపో మాపో కాలు తీసేయకపోతే బ్రతకదని డాక్టర్లు చెప్పేశారు. కాలుపోయినా బ్రతికి బట్టకడుతుందన్న నమ్మకమేమీ లేదు. ముప్ఫై అయిదేళ్ళుగా సంసారం చేస్తున్న మనిషి మంచాన పడితే ఒక నిముషం దగ్గర కూర్చుని ఒక మంచిమాట ఆడటానికి తోచదుగానీ, గాలికి పడిపోయిన కంచెను సరిచేయనూ, మొక్కలకు నీళ్ళు పోయనూ, సైకిలు శుభ్రం చేయనూ మాత్రం బోలెడు శ్రద్ధ చూపించే ఈ మగవాడిని కట్టుకుని ఏం సుఖపడింది గనక?' శివయ్య ప్రశ్నకు సమాధానం చెప్పాలనిపించలేదు వర్ధనమ్మకు.

"అమ్మా! భవానీ! కాసిని మంచినీళ్ళు తెచ్చి పెట్టమ్మా, గొంతు ఆర్చుకపోతూంది" అంటూ నీరసంగా కూతుర్ని పిలిచింది.

ఆవిడ కాళ్ళమీద నుండి తొలగిపోయిన దుప్పటిని సరిచేస్తూ, నీరుపట్టి లావుగా వాచిపోయి, నీచు కంపు కొడుతున్న ఆవిడ కుడికాలు వైపు చూసి చిన్నగా నిట్టూర్చాడు శివయ్య.

కాపరానికి వచ్చేనాటికి నిండా పదహారేళ్ళు లేవు వర్ధనికి. స్వతహాగా అందగత్తె కాకపోయినా, వయసు తెచ్చిన మెరుపుతో మిసమిసలాడుతూ ఉండేది. ఒక్కత్తే ఆడపిల్ల కావటాన, గారాబంగా పెరిగిందేమో, కొత్తలో వంటకూడా సరిగ్గా చేతనయ్యేది కాదామెకు. ఇంట్లో పని సగానికి పైగా శివయ్యే ఓపికగా చేసుకునే వాడు.

ఉన్నా లేకపోయినా, ఆడంబరంగా బ్రతకాలనే తత్వం వర్ధనిది. వెనకాల ఆస్తి ఏమీ లేకపోవడం వలన తన సంపాదనలోనే ఇంటి ఖర్చూ పిల్లల భవిష్యత్తూ, రేపటిని గురించిన ఆలోచన శివయ్యను డబ్బు దగ్గిర కాస్త నిక్కచ్చి మనిషిగా చేశాయి.

రానురాను వర్ధనిలో అసంతృప్తి పేరుకుపోయింది. పిల్లల ముందు తన అక్కసు వెళ్ళబుచ్చుకునే దావిడ. ఆమె ఆశించినట్టే పిల్లలు తల్లికి చేరువయ్యారు. కానీ, తల్లిపట్ల జాలి, సానుభూతి, తండ్రి ఎడల నిరసన చోటు చేసుకున్నాయి వారిలో.

భవాని గ్లాసులో నీళ్ళు తీసుకువచ్చి తల్లి చేత తాగించి, విసనకర్ర తీసుకుని విసరసాగింది.

"రాత్రల్లా నా దగ్గిరే కూర్చున్నావు. వెళ్ళి కాస్త నడుము వాల్చుకో, తల్లీ, ఎలాగూ పోయే ప్రాణానికి ఈ సేవలెందుకు?" వర్ధనమ్మ కూతుర్ని వారించింది.

"డబ్బు వెదజల్లి నీకు వైద్యం చేసే స్థితిలో లేకపోయినా, దేవుడిచ్చిన బలం ఉంది నాకు, ఈ మాత్రం నీకు చెయ్యకపోతే ఎందుకే మేము?" తల్లి చేతిని తప్పిస్తూ అన్నది భవాని.

అంతదాకా అక్కడే నిలబడి ఉన్న శివయ్య కూతురి నిష్ఠుర వచనాలు వినగానే భారంగా అడుగులు వేస్తూ వంటింటి వైపు కదిలాడు.

ప్రతి కన్నె మనసూ అందమైన కలల్నే కంటుంది. కానీ, ఆ కలల్ని కల్లలుగానే చేసే ఆర్థిక సూత్ర న్యాయాన్ని ఎదిరించలేక తల వంచిన రోజున, తన దురదృష్టానికి మరొకరిని బాధ్యులుగా చేసి తృప్తి పడుతుంది. గుమాస్తా భార్యగా స్థిరపడి అయిదేళ్ళు దాటుతున్నా, భవాని కరిగిపోయిన తన కలల్ని మరిచి పోలేదు. అందుకు కారణమైన తండ్రిని క్షమించలేదు. ఇప్పుడు ఖర్చుకు వెనకాడి తల్లిని అన్యాయం చేస్తున్నాడని తండ్రి మీద కోపంగా ఉన్న దా పిల్లకు.

అప్పటికే వంటింట్లో కూర్చుని ఉన్న రెండో కొడుకు ముకుందం పక్కనే వెళ్ళి కూర్చున్నాడు శివయ్య, ఆయన ముందర వెండి కంచం తీసుకుని వచ్చి పెట్టింది కోడలు.

"నాక్కూడా ఆకులోనే వడ్డించమ్మా" అంటూ కంచం తీసుకుని వెళ్ళి పెట్టెలో పడేసి వచ్చాడు శివయ్య.

ఆ కంచం అతనికి పెళ్ళిలో మామగారు చదివించారు. ఆ నాటి నుండి ఇంతదాకా ఏ పూటా మరో దానిలో అన్నం తినలేదు శివయ్య.

కోడలు ఆశ్చర్యంగా ఆయనకేసిచూసి, వెళ్ళి విస్తరాకు తెచ్చి వేసి, ఇద్దరికీ వడ్డించింది. అన్నం కలుపుతూ – "కోడల్ని, పిల్ల వాడినీకూడా తీసుకు రాలేక పోయావట్రా?" అని అడిగాడు శివయ్య.

"అందరూ కట్ట కట్టుకుని వచ్చి పడితే ఇక్కడ ఖర్చుల సంగతి చూడద్దా నాన్నా?" తలఎత్తకుండానే సమాధానమిచ్చాడు ముకుందం.

శివయ్యకు ముద్ద గొంతులో అడ్డం పడి గుండె పట్టేసింది. గ్లాసెడు నీళ్ళు గటగట తాగేశాడాయన. పిల్లల మనసు ఆయనకు తెలియనిదికాదు. కానీ, ఆయన మనసు పిల్లల కర్థం కాలేదనే శివయ్య బాధ.

ముకుందం బి.ఎ. డిగ్రీ తీసుకునే నాటికి సరిగ్గా శివయ్య రిటైరయ్యాడు. అన్నయ్య లాగా పై చదువుల మాట ఎత్త లేదు ముకుందం. అతడు చెయ్యగల ఉద్యోగానికి కావలసింది పెద్ద డిగ్రీలు కావని అతనికి తెలిసింది. అందుకే ముందు తల్లి ద్వారానూ, ఆనక స్వయంగానూ 'డబ్బుతో ఉద్యోగాన్ని కొనుక్కో వచ్చు' నని తండ్రికి సూచించాడు. వేలకు వేలు లంచాలు పొయ్యడం తన వల్ల కాదని నిర్మొహమాటంగా చెప్పాడు శివయ్య.

తనకా డబ్బు ఊరికేనే ఇవ్వనక్కర్లేదని, అప్పుగా ఇస్తే చాలుననీ, కావాలంటే నోటు రాసిస్తాననీ తల్లిముందర ఎగిరాడు ముకుందం.

"పిల్లల కన్న మీకు డబ్బే ముఖ్యమటండీ? ఆ ప్రావిడెంటు ఫండు డబ్బు మనం కట్టుకుపోతామా? రేప్పొద్దున్న మీరు వాళ్ళమీద ఆధారపడినప్పుడు వాళ్ళూ మీకు మొండి చెయ్యే చూపిస్తారు లెండి." అంటూ భర్తని సాధించింది వర్ధనమ్మ.

"అందుకేనే ఇవ్వనంటున్నది ... మనం బ్రతికినంతకాలం ఎవరికీ బరువు కాకూడదనే, వర్ధనీ! నేను లేకపోయినా నీకు తిండికి లోటుండకూడదనే నీ పేరిట ఇల్లు కొనడానికి అడ్వాన్స్ కూడా ఇచ్చేను. పిల్లల్ని కన్నందుకు నా శక్తి మేర వాళ్ళకు చదువులు చెప్పించాను. పిల్ల పెళ్ళి చేశాను. ఆస్తి ఇవ్వకపోయినా కానీ అప్పు చెయ్యలేదు నేను. అందుకు సంతోషించమను వాళ్ళను." నిర్వికారంగా జవాబిచ్చాడు శివయ్య.

తండ్రిమీద కక్ష సాధించడానికన్నట్టు ఒక పుస్తకాల షాపులో అసిస్టెంటుగా వంద రూపాయలకు కుదురుకున్నాడు ముకుందం.

తన ఖర్చుకు గాను ముకుందం తల్లి చేతికి ఏభై రూపాయలిచ్చిన రోజున వర్ధనమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. మెదలకుండా ఊరుకున్నాడు శివయ్య. నాలుగేళ్ళు అలా పనిచేసి, కూడబెట్టుకున్న డబ్బుకు జతగా లోను తీసుకుని పక్క ఊళ్ళో స్వంతంగా పుస్తకాల షాపు తెరిచాడు ముకుందం. ఆ రోజు తృప్తిగా నిద్రపోయాడు శివయ్య. ఈ బ్రతుకులో బాధ్యతలన్నీ తీరాయని నిశ్చింతగా ఊపిరి తీసుకునేంతలో వర్ధనమ్మ మంచ మెక్కింది.

అన్నం తినడం ముగించి, చెయ్యి కడుక్కుని, తువ్వాలు భుజాన వేసుకుని చెప్పులు తొడుక్కున్నాడు శివయ్య. పడక కుర్చీలో వాలి ఏదో పుస్తకం తిరగేస్తున్నాడు ముకుందం.

"నేను ఊరు వెడుతున్నాను. రేపటికి గానీ రాలేనేమో.. నువ్వూ, అన్నయ్యా కాస్త ఇంటి పట్టునే ఉండండి." కొడుకుతో చెప్పి గుమ్మం దాటాడు శివయ్య.

చేతికి బరువుగా వేలాడుతున్న సంచీ సైకిలుకి తగిలించి, నడిపించుకుంటూ వెళుతున్న తండ్రి వైపు ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు ముకుందం.

మరునాడు సాయంకాలానికి గానీ పని పూర్తి చేసుకొని ఇల్లు చేరలేకపోయాడు శివయ్య. ఆయన ఇంటిని సమీపించేసరికి అరుగుమీద వర్ధనమ్మ శవం ఎదురయింది. చుట్టూ చేరి కూతురూ, కొడుకులూ, కోడలూ దుఃఖిస్తున్నారు.

అంతదాకా మనసుకు ధైర్యాన్నీ, మనిషికి ఉత్సాహాన్ని ఇచ్చిన జేబులోని నోట్ల కట్టలు ఒక్కసారిగా బరువెక్కిపోయి గుండెను నొక్కేస్తున్నట్టనిపించింది శివయ్యకు, అతి ప్రయాస మీద ఆ నాలు గడుగులూ వేసి అరుగుమీద ఉన్న కుర్చీలో కూలబడ్డాడు శివయ్య.

పక్క పల్లెలో ఉంటున్న వర్ధనమ్మ అన్న కబురు తెలిసి పరిగెత్తుకుని వచ్చాడు. "కూర్చుంటే లాభం లేదు. కావలసిన తతంగం ప్రారంభించా''లన్నాడు.

అంతదాకా స్తబ్దంగా కూర్చున్న శివయ్య కదిలాడు. జేబులో నుండి అయిదు వంద రూపాయల నోట్లు తీసి బావమరిది చేతిలో పెట్టి – "అన్నీ నువ్వే చూసుకో, బావా!" అని మాత్రం అన్నాడు. ఆ క్షణంలో తననే చూస్తున్న మూడు జతల కళ్లను ఎదుర్కొనే శక్తి లేనట్టు నిస్సత్తువగా కుర్చీలో వాలి కళ్ళు మూసుకున్నాడు.

ఆ పది రోజులలోను శివయ్య పది మాటలు కూడా మాట్లాడలేదు. ఇంట్లో ఎంత ఖర్చవుతున్నదీ, ఏం దుబారా జరుగుతున్నదీ పట్టించుకోలేదు. బంధువులెరన్నా రావడం తడవు కూతురూ, కోడళ్ళూ కళ్ళనీళ్ళు పెట్టుకోవడం, కొడుకులు తల్లి మంచితనాన్ని మననం చేసుకోవడం జరుగుతున్నదే గానీ, శివయ్య కంట తడి పెట్టడం మాత్రం ఎవరూ చూడలేదు.

"తన మిరియాల గాజుల జత నాకిస్తానని అమ్మ ఎప్పుడూ అంటుండేది. కానీ, నాన్నకు మనసు రావద్దూ?" అన్నది భవాని.

"ఏం పండగ వచ్చినా పబ్బము వచ్చినా అత్తయ్య తనకున్న ఒక్క గొలుసు పాపం మనమరాలికి మెళ్ళో వేసి మురిసిపోయేవారు. తెలిసీ తెలియని పిల్లా – అది "నానమ్మ, నాకిచ్చేస్తావా గొలుసు?" అనడిగితే చాలు. "నీదేనే తల్లీ, ఈ గొలుసు' అంటూ దాన్ని ముద్దులాడేవారు...." అర్థయుక్తంగా అన్నది పెద్ద కోడలు...

"ఇల్లూ ఇల్లంటూ డబ్బంతా పోసి కొన్నాడు. ఇప్పుడెవరుంటున్నారని ఈ కొంపలో? అమ్మేసి ఎవరిది వాళ్ళకు ఇచ్చేస్తే కొడుకుల దగ్గర నిశ్చింతగా జరగదా ఏమిటి తనకు?" అన్న కృష్ణమూర్తి అభిప్రాయాన్ని ఖండిస్తూ – "ఆ మాట గట్టిగా అనేవు, అన్నయ్యా, డబ్బుకు ఆయన ప్రాణానికి లంకె. తన సొమ్ము కోసం ఆశ పడుతున్నామని గింజుకుంటాడు మళ్ళా..." అని ముకుందం అభ్యంతరం చెప్పడం శివయ్య చెవిని దాటిపోలేదు.

అందరూ హాయిగా నిద్రపోతున్నా, శివయ్య కంటికి కునుకు పట్టలేదారాత్రి. నెమ్మదిగా లేచి కూర్చుని శబ్దం చెయ్యకుండా భార్య పెట్టె తెరిచాడు. గాజుల జత, ఒంటి పేట గొలుసు దీపం వెలుగులో మెరిశాయి. ఒకవైపు మూలగా పడివున్న పుస్తెలు చేతిలోకి తీసుకున్నాడు శివయ్య. వాటి స్పర్శ అతనిలో ఎన్నో జ్ఞాపకాలను రేపింది. వాటినలాగే పట్టుకొని, నిశ్శబ్దంగా నడుస్తూ దొడ్లోకి వచ్చి బావి గట్టున కూర్చున్నాడు శివయ్య.

భరించలేని ఒంటరి తనం గుండెను నొక్కి వేస్తుండగా, అంతదాకా అడుగుపొరలలో అణిగివున్న దుఃఖం ఒక్కసారి ఎగిసి వచ్చింది. దోసిట్లో ముఖం దాచుకున్నాడు శివయ్య. అలా ఎంతసేపు కూర్చున్నాడో!....

"తాతయ్యా! తాతయ్యా! ఎందుకు ఏడుస్తున్నావు? నానమ్మ దేవుడి దగ్గరికి వెళ్ళిపోయిందా?" ముద్దుగా అడుగుతున్న పసిదాని మాటలు విని ఉలికిపడి చూశాడు శివయ్య?

"ఏడవకు తాతయ్యా, మనం కూడా నానమ్మ దగ్గరికి వెళ్ళిపోదాంలే..." చిట్టి చేతులతో శివయ్య కళ్ళు తుడిచింది ఆ పాప.

"చిన్నీ అంటూ పాపను అక్కున చేర్చుకున్నాడు శివయ్య. కృష్ణమూర్తి మొదటి బార్య కూతురు చిన్నీ. తల్లిని చంపి పుట్టిందా దురదృష్టవంతురాలు. భార్యపోయిన సంవత్సరంలోగా మళ్ళీ పెండ్లి చేసుకున్నాడు కృష్ణమూర్తి. చిన్ని మేనమామ దగ్గరే పెరుగుతుంది. అప్పుడప్పుడూ పాపను తీసుకొని వచ్చి పది రోజులుంచుకొని పంపించేవాడు శివయ్య.

"రా, తాతయ్యా, పడుకొందువు." శివయ్య చేతిని పట్టుకొని లాగుతూ పిలిచింది చిన్ని. ఆ పిల్ల వెత్తుకొని లోపలికి నడిచాడు శివయ్య.

కర్మకాండ ముగిశాక, బంధువులందరూ వెళ్లిపోయాక, అరుగుమీద కూర్చుని 'టు లెట్' అన్న పెద్ద అక్షరాలు అట్టమీద గుండ్రంగా దిద్దుతున్న శివయ్య వైపు ఆశ్చర్యంగా చూశారు అతని కొడుకులు, కోడళ్ళు, కూతురు, అల్లుడు.

"చిన్నీని నా దగ్గరే ఉంచుకుంటున్నాను. మాకు రెండు గదులుంటే చాలునని ఒక భాగం అద్దెకిస్తున్నాను." చాలా మామూలుగా చెప్పి, తన పనిలో నిమగ్నమయ్యాడు శివయ్య.

**ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక**

తేది : 1-12-1976